
# పుత్రుడు కదా?



చెక్కిన చెక్క పేడులా సన్నంగా ఉన్న ఆకుర్రవాడు బాటపక్కన నిటారుకొమ్మలా నిలబడి ఉన్నాడు– మౌనంగా.

మసిపేలికల్ని చుట్టచుట్టి వాడితలమీద పెట్టినట్లు గూడుకట్టుకొన్న వెంట్రుకలు... గుంటలు పడిన కండ్లు... ఆ కండ్లల్లో ఎర్రజీర... బాగా లోతుకు పీక్కుపోయిన దవడలు... మాసిన బట్టలు... ఆ కుర్రవాడి వయసు ఇరవై ఏండ్లకు అటోయిటోగా ఉంటుంది.

ఎదురుగా ఏదో ఒకదేవాలయ మహద్వారాన్ని తలపింపచేస్తున్నట్లు రైల్వేస్టేషన్ బిల్డింగ్స్...ఆ బిల్డింగ్స్‌కు ఎదురుగా తూర్పు పడమరలుగా సాగిపోతున్న వెడల్పుయిన బాట... ఆ బాట మీద, రైల్లో సీటుదొరకని వాళ్ళు బస్‌స్టాండ్‌కు, బస్సులో సీట్‌దొరకని వాళ్ళు రైల్వేస్టేషన్‌కి– పార్టీలో టిక్కెట్టు దొరకని రాజకీయనాయకులు పార్టీలు ఫిరాయించినట్లు ఇటునుండి అటు, అటు నుండి ఇటు తిరుగుతుంటారు. ఇటునుండి అటు నడిచినా, అటునుండి ఇటునడిచినా

రైల్వేస్టేషన్‌నుండి బస్టాండ్‌కు అయిదునిమిషాల కంటే ఎక్కువకాలం పట్టదు గనుక, ఆ మధ్య ప్రాంతం వచ్చే పొయ్యేజనంతో సమ్మర్దంగా ఉంటుంది.

ఒకానొక ప్రాంతంలో– తనకు పలుకుబడి విరివిరిగా ఉంటుందన్న ప్రాంతంలో నమ్మకంగా నామినేషన్ ఫైల్‌చేసిన ఎమ్మెల్యేలాగా ఆ కుర్రవాడు సరిగ్గా అలాంటి ప్రాంతాన్నే ఎన్నిక చేసుకొన్నాడు.

బాటపక్కన నిలబడి ఒకసారిదీనంగా మరొకసారికోపంగా ఇంకొకసారి నిస్సహాయంగా చూస్తున్నాడు– తన ముందర పడివున్న శవాన్ని!

ఆ స్టేషన్ ముందర విశాలమైన బాటలో అంతకు ముందుగానే ఆరడుగుల పొడవు, నాలుగడుగుల వెడల్పు స్థలాన్ని శుభ్రపరిచాడు. ఆ స్థలంలో శవాన్ని పడుకోబెట్టాడు. ఆ శవంపైన చాలీచాలని ఒక గుడ్డను కప్పాడు. ఆ గుడ్డమీద అక్కడొకటి అక్కడొకటిగా నాలుగు పువ్వులు పెట్టాడు. తలదగ్గర కాసంతమట్టిని కుప్పదోసి నాలుగు సాంబ్రాణివత్తులు కూడా వెలిగించి కుప్పదోసిన మట్టిలో కుచ్చాడు. ఆ శవానికి పక్కన్నే ఒక తువ్వాలు గుడ్డ పరిచాడు. ఆ తరువాత జేబులో చెయిపెట్టి పదిపైసలబిళ్ళ చేతికందుకొన్నాడు. చేతులు జోడించి శవాని కొక్క నమస్కారం పెట్టి ఆ పదిపైసల బిళ్ళని కండ్లకద్దుకొని ఆ తువ్వాలు మీదికి విసిరాడు. ఆ తరువాత ఆ దృశ్యాన్ని పరికించిచూశాడు– ఒక చిత్రాన్ని అత్యంత శ్రద్ధతో పూర్తి చేసిన చిత్రకారుడిలాగా!

ఇప్పుడాశవం పక్కన్నే మౌనంగా నిలబడుకొన్నా ఆ కుర్రవాడు– ఒకసారి కోపంగా మరొకసారి దీనంగా ఇంకొకసారి నిస్సహాయంగా– ఆ శవంవైపు చూస్తున్నాడు. వాడేకాదు– వస్తూ పోతున్న వాళ్ళు కూడా చూస్తున్నారు.

చూస్తున్న వాళ్ళకు తెలుసు అది అనాథ ప్రేతమని!– అనాథ ప్రేతసంస్కార పుణ్యం కంటే గొప్ప పుణ్యం మరొక్కటి లేదనీ వాళ్ళకు తెలుసు. అందుకే కొందరు ఆ దృశ్యం కంట పడగానే జేబుల్లో చేతులుపెట్టి చేతి కొచ్చిన పావలా పరకా ఆ తుండు గుడ్డ మీదికి విసిరేసి అంతోయింతో పుణ్యాన్ని మూటగట్టుకొంటున్నారు. కొందరు నిట్టూరుస్తున్నారు. మరి కొందరు నిస్సహాయంగా చూస్తూ ముందుకు కదిలిపోతున్నారు.

"ఛీ ఛీ! ఏం దేశమో! ఏం పాడో! ఇంక ఈ దేశం బాగుపడ్తుందా? ఈ ఆకలిచావుల్ని, ఈ అనాథ ప్రేతాల్ని పట్టించుకొనే స్తోమతులేదు. కానీ, ఏవో వొరగబెట్టపోతారంట!– సిగ్గూ ఎగ్గూ లేకపోతే సరి!– ఆ మైకులు గొంతులు చించుకునేది చూస్తే..."

ఒక ప్రగతి కాముకుడు జేబులో చెయ్యిపెట్టకుండా తెగ బాధపడిపోతున్నాడు.

"దేశాన్ని గురించి ఆలోచించే రోజులు పొయ్‌నాయ్ బాబూ! పీనుగుల్ని మింగే వాడొకడైతే ఏనుగుల్ని మింగే వాడొకడుగా తయారైనారు. మా కాలంలో..." ముందు తరాలకు చెందిన ఒక వృద్ధుడు తన తరాన్ని తలచుకొంటుంటే గుబురు మీసాల మాటున తృప్తి తొంగిచూస్తూ ఉంది.

"ఆ పీనుగుల్ని మింగే మహానుభావుడెవుడో ఈ పీనుగను కూడా అట్లా మింగేసుంటే ఏ బాధా లేకపొయ్యేది."

ఆ మాటతో అనాథప్రేతాన్నీ అస్తవ్యంగా తయారయిన దేశగతిని మరిచి ఆ ఇద్దరూ కలగలిసి నవ్వుకొన్నారు.

ఆ దారి వెంబడి మనుషులు వస్తున్నారు. పోతున్నారు. వస్తూ పోతూ తలకొక తీరుగా మాట్లాడుతున్నారు. నోరాడనివాళ్ళ చేయిమాత్రం ఆడుతూ ఉంది. పదిపైసలో ఇరవై పైసలో ఆ తుండుగుడ్డమీద పడుతూ ఉంది.

వీటికన్నిటికీ అతీతుడైనట్లు ఆ కుర్రవాడు శవం పక్కన చెక్కిన బొమ్మలా నిలబడుకొన్నాడు.

ఈ దృశ్యాన్ని మనుషులు చూసినట్లే కాలపురుషుడుకూడ చూస్తున్నాడు. అయితే వాడు కరుణారహితుడు. అందుకే తనకేమీ పట్టనట్లుగా వాడు ముందుకు సాగిపోతున్నాడు.

పొద్దు నడిమిట్టకెక్కి మిడిసిపడ్తూ ఉంది.

తల దగ్గర ముట్టించిన సాంబ్రాణి వత్తులు కాలికాలి బూడిదగా రాలి, తన అర్హతను గురించి ఆలోచించకుండా ఇసుకలో చేరిపోవాలని ప్రయత్నించి, ఆ తరువాత గాలి కెగిరిపోయింది– ధనికుడితో చేయికలపాలని ప్రయత్నించి విఫలుడైన పేదవాడిలాగా... ఆ శరీరాన్ని వదిలి వెళ్ళిపోయిన జీవుడిలాగా!

శవంమీద అక్కడొకటి అక్కడొకటి పెట్టిన పూలు ఎండ దెబ్బకు వాడివత్తలయ్యాయి.

ఉదయాన్నుండి నిలబడి నిలబడి, ఆ కుర్రవాడి కాళ్ళు గుంజుతున్నాయి. కడుపులో పేగులు కలబెడుతున్నాయి. కండ్లు గిర్రున తిరుగుతున్నాయి. నిలబడలేక, కూలబడడానికి వీలుగాక సతమతమై పోతున్నాడు.

పడుకోబెట్టి ఉండేది జీవంలేని శవం.

నిలబడుకోని ఉండేది జీవచ్ఛవం.

అంతే తేడా!!

అయితే జీవచ్ఛవంలాంటి ఆకుర్రవాడుమాత్రం నిలబడలేక నిలబడుకొన్నా, వచ్చేపొయ్యేవాళ్ళు వేస్తున్న డబ్బును ఒకచూపు చూస్తున్నా వాడి మనస్సు మాత్రం దాదాపు ఏడెనిమిదేండ్ల వెనక్కు వెళ్ళింది.

అప్పుడు ఆశవంలో జీవుడున్నాడు.

ఆ జీవుడు సటపటమైన జీవుడు కాదు. ఎందరో ఎన్జీవోలపాలిట హెడ్ ఆ జీవుడు. ఆ రోజుల్లో ఆ జీవుడికి చాలాచాలా పేర్లుండేవి.

"యముడ్రా తండ్రీ!" అని ఒక్కడంటే, "కాదురా! యముడెత్తుకొని పోతుంటే జముడులో పడిన పిడుగు!" అని ఇంకొక్కడనే వాడు. 'ఈ వెధవెట్లాంటి చావు చస్తాడో కానీ, ఇప్పుడే మనల్ని చంపి చట్లో పెట్టేస్తున్నాడు.' అని తన అక్కసంతా వెళ్ళగక్కేవాడు ఇంకొక్కడు.

ఎవ్వరెన్నివిధాల ఎత్తిపోసినా అరటిపండులో సూదిగుచ్చినంత సూక్ష్మంగా మాట్లాడే స్వభావాన్ని సొంతం చేసుకొన్న ఆ జీవుడు అధికారుల్ని అరచేతిలో పెట్టుకొని ఆడించేవాడు.

ఇక ఆఫీసులో అతడాడిందాట! పాడిందిపాట!!

ఆడింది ఆట! పాడింది పాటగా జీవితం కొనసాగేవాళ్ళ అలవాట్లు కూడా సాధారణంగా అదుపుఆజ్ఞల్ని అధిగమించే ఉంటాయి!

ఆఫీసులోనే కాదు– అయ్యగారు ఇంట్లో అడుగు పెట్టినా అంతే!

ఇంటికి వస్తూ కప్పనుమింగిన పాముకడుపులా ఉబ్బినజేబును అయ్యగారు ఒక్కసారి అలవోకగా తడిమి చూస్తాడు. కండ్లల్లో తృప్తి... పెదవులపై చిరునవ్వు– తొణికిసలాడుతూ ఉంటుంది. అప్పుడు అయ్యగారికి తన ఒక్కగానొక్క కొడుకు మనసులో మెదలడు. ఒకటిన్నర దశాబ్దం తనతో కాపురం వెలిగించి కష్టసుఖాల్ని పంచుకొన్న అర్థాంగి ఆశలు అసలే మనసుకు తోచవు. అయితే రకరకాల సీసాల్లో రమ్యంగా అలంకరించుకొన్న బ్రాందీ అంగడిమాత్రం గిలిగింతలుపెట్టి ఆహ్వానిస్తుంది. వెళ్ళి అరసీసా మందుకొని జేబులో భద్రపరుచుకొంటాడు.

ఆ జీవుడు ఏది మరిచి మరేదిమరిచిపోకున్నా ఇదిమాత్రం మరిచిపోడు. ఆ రోజు తన అదనపు సంపాదనలో ఆమాత్రం ఉదారంగా ఖర్చుపెట్టకపోతే– ద్రవ్యమారక సిద్ధాంతమే దెబ్బతింటుందని అతని ప్రగాఢవిశ్వాసం.

అతడు ఇంట్లోఅడుగుపెట్టి ఆఫీసువేషం విప్పి లుంగీలో దూరి నింపాదిగా ముఖప్రక్షాళనం చేసుకొనేసరికి–అతగాడి అభ్యంతర మందిరంలో కుర్చీ... కుర్చీముందర టీపాయ్... ఆ టీపాయ్ మీద శుభ్రంగా కడిగిన గ్లాసు... సోడాలు... మంచుముక్కలు– మధ్యమధ్య నంజడానికి మాంసం ముక్కలు కాకపోయినా వేడివేడి పకోడీలు– సిద్ధంగా ఉండాలి.

ఈ పనులన్నీ చేసి పెట్టాల్సింది ఎవరు? ఇంట్లోనౌకరా? నౌకరంటూ ఒకడుంటేగదా? కట్టుకొన్న పెండ్లామా? ఆమె కొంతకాలం తన ఓపికను పరీక్షించుకో గలిగినంత మేరకు పరీక్షించుకొని, ఆ తరువాత పోట్లాడి, కొట్లాడి, తన్నులు తిని, తిన్నా ఫరవాలేదనుకొని ఆ పనికి రాజీనామా చేసింది.

రాజీనామా చేసేహక్కు వ్యక్తిగా అయితే అందరికీ ఉన్నట్లే ఆమెకు కూడా ఉంది. అయితే–

ఆమెచేస్తున్న ఉద్యోగం ప్రభుత్వపరమయింది కాదు. అది సంసారం. అతడు భర్త. ఆమె భార్య. ఇందుకు సాక్షులుగా అగ్ని ఉన్నాడు. ముక్కోటి దేవతలున్నారు. సూర్య చంద్రులున్నారు. నక్షత్రాలున్నాయి. ఇవీ చాలవను కొంటే భూమ్యాకాశాలున్నాయ్– కావలసినంత విశాలంగా!

వీళ్ళందర్నీ అడ్డంపెట్టుకొని అతడామెను సతాయిస్తున్నాడు. ఆమె సాధ్వి. ఆ సతాయింపుల్ని సాధింపుల్ని పడకూడదనుకొంటూనే పడుతూ ఉంది. సహనం నశించినపుడు తిరగపడ్తూ ఉంది. తిరగబడినపుడు తప్పని సరిగా తన్నులు తింటూ ఉంది.

వీళ్ళిద్దరి మధ్యపడి నలిగిపోతున్నాడు– పదేండ్లవయస్సులో ఏడవతరగతి చదువుకొంటున్న వాళ్ళ ఏకైక పుత్రుడు. తండ్రి చేస్తున్నది అక్షరాలా తప్పని తెలుసు. అయినా నిలదీసి అడిగే

వయసు కాదు. తల్లి వాదనలో వేదనలో అర్థముందని తెలుసు. అయినా ఆమె పక్షాన నిలబడలేదు. అటునూయి. ఇటుగోయి. ఏంచేయాలో ఆ పసి బుర్రకు బుర్రగోక్కొన్నా తోచలేదు. తోచలేదని వాడు ఆలోచించడం మానుకోలేదు.

ఆ లేతమనసు ఆలోచించి ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చేసింది.

తల్లి చేస్తున్నపనుల్ని ఇకమీదట తాను చేయాలని నిర్ణయించుకొన్నాడు.

తండ్రి రాత్రి ఏడెనిమిది గంటలప్పుడు ఇంట్లో అడుగుపెట్టేసరికి తల్లి ఏ గదిలోనో గోడకు చేరగిలబడి కన్నీరు మున్నీరుగా విలపిస్తూ ఉంటుంది. ఆ కుర్రవాడు మాత్రం, 'కీ' ఇచ్చిన మరబొమ్మలాగా తిరుగుతూ తండ్రి అభ్యంతర మందిరంలో కుర్చీవేస్తాడు. ఆ కుర్చీ ముందర టీపాయ్...దాని మీద శుభ్రంగా కడిగిన గ్లాసు...మంచు ముక్కలు...సోడాలు– అమర్చి పెడతాడు. ఆమీదట వెళ్ళి కూర్చొని తన చదువుతో తాను కుస్తీపడుతుంటాడు.

తండ్రి తాగుతూ తాగుతూ అలానే కుర్చీకి చేరగిల పడి నిద్రపోవచ్చు. తల్లి వంటింట్లో గోడకు చేరగిలబడి ఏడుస్తూంటే ఒక్కొక్క రోజు తెల్లారిపోవచ్చు. ముందర వేసుకొన్న పుస్తకాల మీద అలానే పడి ఆ పసిమనసు కునుకు తీయవచ్చు!

ఎవరు తిన్నారు? ఎవరు తినలేదు? అని పట్టించుకొనేస్థితి చేయిదాటి ఆ ఇంట్లో ఎంతో కాలమైపోయింది కాబట్టి– ఆ రాత్రి ఎవరిలోకం వాళ్ళదవుతుంది. వండిన కూడు ఏ కుక్కలకో బిచ్చగాళ్ళకో దక్కుతుంది ఆ మరునాడు.

అయితే ఇంట్లో ఇప్పుడు ముందుమాదిరి రంపులు రచ్చలు లేవు.

కాలం కాస్త ప్రశాంతంగా వెళ్ళిపోతున్నట్లే అనిపించింది.

కుర్రవాడు కళాశాల్లో అడుగు పెట్టాడు.

కనీసం కొడుకైనా ప్రయోజకుడై చేతికందివస్తే అదే చాలనుకొని ఆ తల్లి శతకోటిదేవుళ్ళకు ముడుపులుగట్టి మొక్కుతూ ఉంది. మొక్కిన మొక్కులన్నీ ఫలించేటట్లుగా ఉంటే ఈ దేశంలో దేవుళ్ళు అరనిముషం విశ్రాంతికి అలమటించవలసిందే!

కుర్రవాడు కాలేజీకి వెళ్ళి వస్తున్నాడు. తండ్రి ప్రవర్తనలో ఏ మార్పు కనబడకపోగా, తెచ్చుకుంటున్న మందులో మాత్రం మార్పు కనిపించింది. అది అరసీసానుండి ముక్కాలు సీసాకు పెరిగింది. తల్లి మనోవేదనతో కుంగికుంగి ఒక మంచానికి లొంగిపోవడానికి శక్తినంతా కూడగట్టుకొంటూ ఉంది.

ఎప్పుడూ ఏడుస్తూ తన రాతను తలుచుకొని వాపోతూ జీవితమంటే పట్టీపట్టనట్టుగా ఉండే ఇల్లాలి మొగం మొత్తింది అయ్యగారికి. అందుకే ఇంట్లో అడుగు పెడ్తే చాలు "ఛీ ఛీ! ఏం కొంపో! పాడుకొంప! ఇంతకంటే దెయ్యాలకొంప ఎంతో నయం. మనసుకు సుఖమూలేదు. శాంతిలేదు." అంటూ తాగకముందే తాగినకోతి మాదిరి ఎగిరెగిరిపడుతున్నాడు.

ఇవన్నీ తల్లిచెవిని పడుతున్నా పడనట్లే ఆమె చేతనైనంత మట్టుకు సంసారాన్ని నెట్టుకొని పోతూఉంది. కుర్రవాడు తనకర్తవ్య నిర్వహణలో ఏలోటు రాకుండా జాగ్రత్తపడుతున్నాడు.

రోజులు దొర్లి పోతున్నాయ్!

అయితే ఉన్నట్లుండి కుర్రవాడి కొకరోజు ఒకచిలిపి కోరిక పుట్టింది.

అది వాడి తప్పుకాదు.

నూనూగు మీసాలు మిసమిసలాడే వయసు. తోడుగా కాలేజీ వాతావరణం. ఒంటికి నీరు పట్టినట్లే బుద్ధి పదునెక్కింది. తనకుతానుగా ఆలోచించుకొనే స్థాయికి ఎదిగాడు.

"తండ్రి ఇన్నాళ్ళుగా తాగుతున్నాడు కదా! ఎందుకు? తల్లి వద్దంటున్నది. తనమాట వినలేదని తగువు లాడింది. తన్నులు తినింది. ఇప్పుడేమీ చేయలేని స్థితిలో దినదినానికి కుంగి కృశించి పోతూఉంది. అయినా తండ్రికి చీమ కుట్టినట్లనిపించకుండా సీసాలకు సీసాలు ఖాళీ చేస్తున్నాడే? ఎందుకు తాగుతున్నట్లు? అందులో ఏదో ఒక ఆనందం లేకపోతే ఆయన ఎందుకింత పట్టింపుగా తాగుతాడు? ఇదే నిజమైతే ఆయన పొందే ఆనందం ఎలా ఉంటుందో?"

ఇలా రకరకాల ఆలోచనల్తో వాడి మనసు సతమత మవుతూ ఉంది. థీరీతోనే తికమక పడడమెందుకు? ప్రాక్టికల్‌గా చూస్తే సరిపోలా? అన్న స్థితికి ఆయత్త మవుతూఉంది.

కోడెవయస్సులో కోరికలు తాడు విడిచిన బొంగరాలు!

ఒకానొకరోజు తండ్రి తాగుతూ తాగుతూఉండి తాగుతున్న గ్లాసును అలానే టేబిల్‌మీద పెట్టి నిండిన కడుపును నిమురుకొంటూ బాత్‌రూంలోకి జొరబడ్డాడు!

అంతే! కుర్రవాడు ఒక్క గుక్కలో గబగబ రెండుగుక్కలు మింగి, తండ్రికి సందేహం రాకుండా ఉండడానికి మళ్ళీ గ్లాసును యథావిధంగా నింపి తండ్రి వచ్చేలోపుగానే అక్కడినుండి ఉడాయించాడు. యథావిధంగా పుస్తకాలముందు కూర్చున్నాడు.

మింగేటప్పుడు గొంతు కాసంత మండినట్లనిపించినా కడుపులోపడిన తరువాత ఏమీ అనిపించలేదు. అయితే కొంచెంసేపటికి కన్నులుమూతలు పడుతున్నట్లుగా...మూతలుపడ్తూ తిరుగుతున్నట్లుగా...శరీరం అమాంతంగా ఎక్కడికో తేలిపోతున్నట్లుగా...ఒక విచిత్రమైన అనుభూతి. మళ్ళీ అదంతా ఏమీ లేదనుకొన్నాడు. తల విదిలించుకొన్నాడు. స్థిమితంగా కూర్చోవాలనుకొన్నాడు. కానీ కుదరలేదు. అందుకే మెల్లగాలేచి వెళ్ళి పడుకొన్నాడు.

పడుకొన్న దొక్కటే తెలుసువాడికి!

తెల్లారింది!

అతి మామూలుగా తెల్లారింది. తెల్లారడంతో నిమిత్తం లేని తండ్రి తనఅలవాటు మేరకు మామూలుగానే నిద్రలేచాడు. మామూలుగా మగత నిద్రకే అలవాటుపడిన తల్లి తెల్లారడంతో నిమిత్తంలేకనే లేచి తనపనులు తానునిర్వహించింది. స్నానపానాదులు ముగించి అయ్యగారు మామూలుగానే ఆఫీసుకు బయలుదేరాడు. అయితే కుర్రవాడికి మాత్రం అమితోత్సాహంగా తెల్లారింది. తనలో ఒక కొత్తతెంపు. ఆతెంపు తనకే ఎంతో కొత్తగా అనిపిస్తూ ఉంది.

'ఓహో! ఇదా కథ'?! అని అనుకొంటూ హాయిగా నవ్వుకొన్నాడు.

ఆ ఆనందాన్ని తాను పంచుకోవాలి. ఎవరితోనైనా పంచుకోవాలి. అయితే ఎవరున్నారు తనకు? కాలేజీలో ఆత్మీయులు. అందుకేవాడు ఆదరాబాదరా కాలేజీకి పరుగులుమీద వెళ్ళాడు.

దీనికంతటికీ అతీతంగా తనబతుకు ఎలా తెల్లారుతుందో? అని ఆలోచనల్లో పడింది ఆ పిచ్చితల్లి!

అయితే ఆరోజు ఆఫీసులో అయ్యగారి ఆలోచనలు మాత్రం విపరీతంగా కొనసాగు తున్నాయి. బతుకు వెలితి. కూర్చున్న కుర్చీవెలితి. ఆఫీసు వెలితి. కడకు ఈ ప్రపంచమే వెలితిగా కనిపిస్తూ ఉంది. ఆ వెలితిని పూడ్చుకోవడమెలా అన్న ఆలోచనల్లో పడింది అయ్యగారి మనస్సు.

"నేను సంపాదిస్తున్నాను. ఒక్కచేత్తోగాదు, రెండుచేతుల్తో. నా సంపాదనతో పోలిస్తే నాఖర్చేపాటి? – ఏదో అలవాటు. ఎలా అలవాటయ్యిందో అయిపోయింది. ఇప్పుడు పొమ్మంటే పోతుందా? పోనీ దీనివల్ల ఇంట్లో వచ్చిన ఇబ్బందేవి? వీళ్ళకేం కొరత జరిగింది? తినడానికి తిండి. కట్టడానికి బట్ట. ఉండడానికొక కొంప. ఇంత చేసినా వీళ్ళకేవైనా కృతజ్ఞత ఏడ్చిందా? పైగా దెప్పులు. లొంగకపోతే ఏడ్పులు. ఛ! ఛ! సుఖము శాంతీ లేని బతుకొక బతుకా?"

ఇలా కొనసాగిన అతగాడి ఆలోచన అది బతుకు కాదనితేల్చి సుఖము శాంతి లభించగల ఇంటికోసం అన్వేషణ ఆనాటినుండి ఆరంభించింది.

చేతి నిండుకు డబ్బుండాలే కానీ ఈ విశాలప్రపంచంలో చిన్నఇండ్లకేం కొదవ? –

అయ్యగారు సుఖసంతోషాలకు నిలయమైన ఒక చిన్న ఇంటిని ఎన్నుకొని ఆ ఇంటితో కొద్దికొద్దిగా పరిచయాన్ని పెంచుకొంటూ డబ్బు పోయినా సుఖం దక్కుతుందన్న తృప్తిలో పడి. ఆ తరువాత చిన్నావిడ మాయలోపడి... కడకు ఆ ఇంటికి దాసానదాసుడై కూర్చున్నాడు.

మొదటిరోజు రెండు గుక్కలు...రెండవరోజు నాలుగు గుక్కలు...మూడవరోజు తొమ్మిది గుక్కలుగా అలవాటుపడిన కుమారరత్నం కాలేజీకి చిక్కంగా మూడు నామాలు పెట్టి తండ్రి ఖాళీ చేసిన అభ్యంతర మందిరానికి చక్కగా తాను వారసుడై కూర్చున్నాడు.

ఇప్పుడతను తండ్రికి మించిన తనయుడు!

ఇంకేముంది?

రోజులు హుషారుగా గడుస్తున్నాయ్!

అయితే ఆ ఇంట్లో ముగ్గురివి మూడుదోవలయ్యాయి.

చిన్నింట్లో అయ్యగారు అమ్మగారి పెద్దపెద్ద కోరికల్ని తీర్చడానికి పెద్దఎత్తున ఎత్తులు ప్రారంభించి ఒకానొకశుభముహూర్తాన పట్టుబడి పదహారుకమ్ములకు ఇవతలే ఉండడానికి పదరానిపాట్లు పడవలసి వచ్చింది.

ముందు మందు. తరువాత క్లబ్బులు. అటునుండి అటే అశ్వమేధయాగాలు! కొంప నాలుగు దోవలు చేస్తున్నాడు కొడుకు.

అబ్బా కొడుకులు అతిరథమహారథులై నిర్వహిస్తున్న ఘనకార్యాల్తో తృప్తిపడి, 'ఈజన్మకింత మట్టుకు చాలురా తండ్రీ!!' అని ఆ మహాతల్లి తృప్తిగా కడపటి శ్వాస విడిచింది.

తాళిగట్టిన భార్యపోయింది. కొడుకు కొరగానివాడయ్యాడు. చిన్నింటావిడ పెద్దింటావిడ అయింది. అందుకే అయ్యగారు ధీమాగా అక్కడికి వెళ్ళాడు. వెళ్ళితే ఏమయింది. మెడబట్టి గెంటలేదు కానీ_ అంతకంటే ఎక్కువగానే గౌరవించింది.

అంతకంటే గొప్ప సత్కారం జరుగుతుంటే ఇరుగూపొరుగు విరగబడి నవ్వారు. వీధి చూసీచూడనట్లు నవ్వింది. ఆఫీసు తనలో తాను నవ్వుకొనింది. తాళిగట్టిన ఇల్లాలు. "అప్పుడే ఏమయింది నీకత? నన్ను పెట్నావే హింస. అది ఎదుర్నూస్తా ఉండాది. నడు. లోకం మూతిమింది కాకులు పొడ్సినట్టు పొడిస్తింది. నీ బతుకు చింవడ. అప్పిటికైనా బుద్దొస్తిందా నీకు? అప్పుడు వచ్చి ఏం ప్రయోజనంలే?" అంటూ వికృతంగా నవ్వుతున్నట్లుంది.

అయ్యగారి బుర్ర గిర్రునతిరిగితే గతం ఒక్కసారి కండ్లముందు తిరిగింది.

"హుం! వ్యసనం మనిషిని తట్టినిమిరి ఎంత నీచానికైనా ఒడిగట్టమంటుంది. నన్ను ఒక లంచగొండిని చేసింది. మంచీచెడూ ఎంచకుండా ఇల్లాలిని హింసించింది. కొడుకును తాగుబోతును చేసింది. చిన్నింటి కోసరం పెద్దపెద్ద పనులు చేయించింది. ఇల్లూ వాకిలిపోయింది. ఇల్లాలు పోయింది. ఉద్యోగమూ ఊడింది. బతుకులో ఈవ్యసనం ఒక తీరనిశాపమై వీధులపాలుచేసింది. ఛీ!ఛీ! ఈ హీనమైన బతుకు బతకడం కంటే చావుమేలు. అంతకంటే మించిన మార్గం కూడా లేదు!" అని కనపడిన దారినిపట్టినడుస్తున్నాడు. వంచిన తల ఎత్తకుండా తిరుగులేని నిర్ణయంతో నడుస్తున్నాడు!

అదే తీరులో ఎవరో సరిగ్గా తనకు ఎదురుగా వస్తూఉంటే తలపైకెత్తాడు.

ఎదురుగా కొడుకు!

ఒకరి మొగం ఒకరు చూసుకొన్నారు. ఒక్కక్షణం చూపుల్లో చూపులుకలిసే సరికి తలలు వంచుకొన్నారు. ఆమీదట ఒకర్నొకరు గబాలున కౌగలించుకొన్నారు. కుమిలికుమిలి ఏడ్చుకొన్నారు.

అయితే ఏం ప్రయోజనం?

ఆ బాధ ఆరేదా? తీరేదా??-

నిలువనీడలేదు. చేతిలో డబ్బులేదు.

ఏదీలేకపోయినా ఎదురుగా లోకం ఉంది.

ఈ లోకంలో ఈరెండూ లేనివాళ్ళగతి సరేకానీ_ఉండి పోగొట్టుకొన్న వాళ్ళగతి? – కుక్కలకంటే హీనమైన గతి!

అందుకే "ఉండేవాడికి ఒక్కయిల్లయితే అడక్కతినేవాళ్ళకు అరవైయిండ్లు" అన్న సామెతను సార్థకం చేయడానికి లోకంమీద పడ్డారు.

ఒక్కపల్లె కాదు. ఒక్క పట్టణం కాదు. ఒక్క ఊరు కాదు. ఒక్కవాడ కాదు. తిరగనిచోటు లేదంటూ జానెడుపొట్టకు మానెడువేషాలు మార్చారు. పెట్టినమ్మ పెట్టింది. తిట్టినమ్మ తిట్టింది. పెట్టినా తిట్టినా అబ్బా కొడుకులకిప్పుడు సమదృష్టి అలవడింది. అయినా తిరగడానికి వయస్సు అడ్డు పడింది.

అందుకే వాళ్ళు తమబతుకుల్ని ఒకయాత్రాస్థలంలో రైల్వేస్టేషన్‌కి పరిమితం చేసుకొన్నారు.

దినమూ కొత్తమొగాలే! ఆ కొత్తకొత్తమొగాలకు వీళ్ళు సరికొత్తబిచ్చగాళ్ళే!– అయితే ఈ పాతబిచ్చగాళ్ళు మాత్రం పాలుమారకుండ పొద్దస్తమానం ఎత్తినచెయ్యి దించకుండా దండాలు పెడ్తున్నారు. చాచినచేతికి వచ్చినంత చాలని తృప్తిపడుతున్నారు. అయితే ఈ జీవితాలు ఎప్పటికైనా అశాశ్వతాలే అని వాళ్ళకొక శాశ్వతమైన నమ్మకం కుదిరింది. అందుకే ఆరోజు సంపాదన ఆరోజే ఖర్చు పెడుతున్నారు– దయాదాక్షిణ్యాలు ఈ లోకంలో ఇంకా గొడ్డుపోలేదన్న నమ్మకంతో!

ఏపూటకాపూట గడిచిపోతూంటే గతాన్ని గురించి ఆలోచించవలసిన అవసరమే లేకపోయింది. అయితే ఒకానొకదినం రాత్రి తండ్రి చెప్పకుండా చెందకుండా జీవితాలు అశాశ్వతాలని నిరూపించి వెళ్ళిపోతే– కొడుకు ఆలోచనలో పడ్డాడు. పుత్రుడు కదా? పున్నామనరకంమాట దేవుడెరుగును కానీ కనీసం దహనంచెయ్యాలి గదా? దహనం చెయ్యాలంటే– నలుగురు వాహకులు...పాడె...ఆరుమూరల తెల్లగుడ్డ...కనీసం నలభై యాభై-రూపాయలన్నా కావాలి. అందుకే స్టేషన్ కెదురుగా శవాన్ని పడుకోబెట్టి శవసంస్కారానికోసరం భిక్షమడుగుతున్నాడు!...

పొద్దుబాగా వాటారింది. వాడికాళ్ళు కుక్కలు పీకినట్లు పీకుతున్నాయి. నోరు పిడచగట్టకపోతూ ఉంది. కండ్లు తిరుగుతున్నాయి. ఎంత ఓపికను కూడదీసుకొన్నా, నిలబడడం కష్టసాధ్యంగా ఉంది.

ఒక్కసారి నిస్సహాయంగా తండ్రి శవంవైపు మరొక్కసారి తుండుగుడ్డమీద పడిన డబ్బు వైపు చూశాడు.

మహాగా ఉంటే ఆ డబ్బు పదిరూపాయలకు లోపుగానే ఉంటుంది.

కనీసం నలభైయాభైరూపాయలన్నా లేకుంటే శవదహనం చేయడానికి వీలుకాదు– వాలిన పొద్దు ఒకరి కోసం ఎదురుచూడదు. ఏం చేయాలి? ఏం చేయాలి? అని ఆలోచిస్తూ ఆలోచిస్తూ ఉన్న ఆ కుర్రవాడు ఉన్నట్లుండి ఆ తుండుగుడ్డమీద డబ్బును గబగబ జవురుకొన్నాడు. అంతకంటే గబగబ ముందుకు నడిచాడు– బస్టాండుకు సమీపంలో ఉన్న సారాకొట్లోకి!

చేతిలో ఉన్న డబ్బును పైసలతోసహా చెల్లించాడు. ఆ డబ్బుకు వచ్చినంత వాడు ఇచ్చినంత అమృతంకంటే తృప్తిగా ఆనందంగా సేవించాడు. ఇప్పుడు కాళ్ళు పీకడంలేదు. కడుపులో మంటలేదు. కండ్లు బైర్లు కమ్మడంలేదు. శవదహనం ఎలా? అన్నతపనే లేదు.

వాడికి హాయిగా ఉంది.

అయితే నోరు మాత్రం వాగుతూఉంది.

'ఒరే తండ్రీ! నిన్ను 'తండ్రీ!' అనడంవే తప్పురా! ఏం చేద్దాం? నువ్వు నన్ను కన్నావు. నేను నీకు పుట్టాను. అందుకే 'తండ్రీ!' అనాలి. అనకుంటే తప్పదు. అయినా నిజంగా నువ్వు తండ్రివే అయ్యుంటే-నాతో చిన్నప్పుడల్లాంటి పన్లు చెయ్యించేవాడివేనా? చెయ్యించినావు కాబట్టే చెడిపోయ్‌నా! నువ్వు చెడిపోయ్‌నావ్. నేనూ చెడిపోయ్‌నా? ఇద్దరంవూ చెడి కొంపను మూడార్లోవలు చేసినాం. అందుకేరా తండ్రీ నీకీగెతి. చేసినోడికి చేసుకొన్నంత. అనుభవించక తప్పుతుందా! అనుభవించు." అని నోటికొచ్చినట్లు వాగుతూ తూలుతూ సోలుతూ యథాస్థానానికి చేరుకొన్నాడు.

చేరుకొంటే ఏముందక్కడ?

అప్పటికే మునిసిపాల్టీ వాళ్ళబండి ఆ అనాథప్రేతాన్ని మీది కెక్కించుకొని ముందుకు సాగిపోతూ ఉంది.

తండ్రి ఏమైపోయాడో తెలియకుండా పాపం! తనయుడు మూతలు పడుతున్న కండ్లను తెరవలేక తెరిచి వెదుకుతున్నాడు. కనపడక పోయేసరికి 'బోరో!'మని ఏడుస్తున్నాడు. ఏడుస్తూ తన తండ్రిని ఎవరో అపహరించుకపోయినట్లు అందరివైపు సందేహంగా చూస్తున్నాడు. తన చూపుల్ని అర్థం చేసుకోలేని లోకం... తన బాధను అర్థం చేసుకోలేని లోకం...తనదారిని తాను పోతూంటే కసి కసిగా చూస్తూ... కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నాడు.

వాడు ఏడుస్తున్నది- తండ్రి దహనసంస్కారాలు చేసే అదృష్టం తనకు దక్కలేదే అన్న బాధతోకాదు. పుత్రుడుగా పున్నామనరకం నుండి రక్షించలేక పోయానే! అన్న తపనతోకాదు. ఆ శవమే అడ్డముంటే ఇంకొక్క పూట ఇలాంటి తృప్తి మిగిలేదే? అన్న బాధతో!

అవునుమరి?

వాడు పుత్రుడు గదా! ●

**భారతి**

(1, జూన్ 1985)